# బలగం TV BALAGAM

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 25 మే 2025 | www.balagamtv.com | పేజీలు 5


## హైదరాబాద్‌కు 800 ఈవీ బస్సులు కేటాయించండి

- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరానికి మరో 800 ఎలక్ట్రిక్ బస్సులు (ఈవీ) కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఇటీవల హైదరాబాద్‌కు 2 వేల ఈవీ బస్సులు కేటాయించారని, ప్రస్తుత నగర అవసరాలను దృష్టిలో పెట్టుకొని పీఎం-ఈ డ్రైవ్ పథకం కింద అదనంగా మరో 800 బస్సులు కేటాయించాలని కోరారు. ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్‌లు బస్సు నిర్వహణ చూసేలా హైబ్రిడ్ జీసీసీ మోడల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ఆర్టీసీ డీజిల్ బస్సుకు రెట్రోఫిట్టెడ్ చేపట్టగా అది సఫలమైందని, ఆ బస్సు నగరంలో రాకపోకలు సాగిస్తోందని ముఖ్యమంత్రి కంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు రెట్రో ఫిట్‌మెంట్ అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## కేరళను తాకిన రుతుపవనాలు



- 8 రోజులు ముందుగానే ..
- భారత వాతావరణ విభాగం

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

షెడ్యూల్ కంటే ఎనిమిది రోజుల ముందే కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఈ విషయాన్ని తెలిపింది. సాధారణంగా జూన్ 1న కేరళను రుతుప వనాలు తాకుతాయి.ఇలా రుతుపవనాలు ముందుగా ప్రవేశించటం 16 ఏండ్లలో ఇదే తొలిసారి కావటం గమనార్హం. చివరగా 2009లో షెడ్యూల్ కంటే ముం దే కేరళను తాకాయి. ఐఎండీ సమాచారం ప్రకారం.. రుతుపవనాలు కేరళలోనే కాకుండా కర్నాటక, పుదుచ్చేరి, తమిళనాడు, మిజోరంలోని కొన్ని ప్రాంతాలకు కూడా చేరుకున్నాయి. ఇవి వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. రాబోయే రెండు, మూడ్రోజుల్లో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడులోని మిగిలిన ప్రాంతాలతో పాటు పశ్చిమ బెంగాల్, సిక్కింలోని కొన్ని ప్రాంతాలకు చేరుకుంటాయని భావిస్తున్నారు. చివరగా 2009, 2001లో రుతుపవనాలు కేరళకు ఇంత త్వరగా వచ్చాయి. ఆ సమయంలో మే 23న రుతుపవనాలు కేరళకు చేరుకున్నాయి.

సాధారణంగా కేరళలో రుతుపవనాలు జూన్ 1న ప్రారంభమవుతాయి. 1918లో మే 11న రుతుపవనాలు ప్రవేశించి రికార్డును నమోదు చేశాయి. 1972లో అత్యంత ఆలస్యంగా జూన్ 18న రుతుపవనాలు ప్రారంభమయ్యాయి. గత 25 ఏండ్లలో 2016లో రుతుపవ నాలు ఆలస్యమయ్యాయి. ఆ ఏడాది జూన్ 9న కేరళలోకి ప్రవేశించాయి. రుతుపవనాల రాక గతేడాది మే30న ఉంటే.. 2023లో జూన్ 8న, 2022లో మే 29న కేరళను తాకాయి.

గత రెండ్రోజులుగా కేరళలో వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. తిరువనంతపురం, కొల్లాం, కొట్టాయం, అలప్పుజ, త్రిసూర్, ఇడుక్కి, మలప్పురం జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. భారీ వర్షాల కారణంగా కేరళలోని పలు ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. పలు నగరాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. కొమ్మలు విరిగి రోడ్ల మీద పడ్డాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. 24, 25 తేదీలకుగానూ 9జిల్లాలకు, 26వ తేదీకి నాలుగు జిల్లాలకు, 27వ తేదీకి ఆరు జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# కేంద్ర రాష్ట్రాల మధ్య సహకారం అవసరం

- రాష్ట్రాలను జాతీయ వృద్ధికి అవసరమైన చోదక శక్తిగా పరిగణలోకి తీసుకోవాలి
- దేశంలో శాంతి, ఐక్యతను కాపాడుకోవాలన్న సంకల్పానికి తెలంగాణ కట్టుబడి ఉంది.
- వికసిత్ భారత్‌కు అనుగుణంగా తెలంగాణ తరపున, తెలంగాణ రైజింగ్ 2047 అనే నినాదంతో మా కార్యాచరణ పథకాన్ని సమర్పిస్తున్నాను.
- 2028 నాటికి కోటి మంది మహిళలు కోటీశ్వరులు
- జూన్ 2 నుంచి యువతకు రూ.5 లక్షల స్వయం ఉపాధి పథకం ప్రారంభం తెలంగాణ రైజింగ్-2047 విజన్
- నీటి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

భారత్ మరింత అభివృద్ధి చెందిన దేశంగా ముందుకు సాగుతున్న ప్రస్తుత సమయంలో కేంద్ర రాష్ట్రాల మధ్య మరింత సమన్వయం, సహకారం, సమాఖ్య స్ఫూర్తి అవసరమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట్రాలను కేవలం ప్రయోగశాలలుగా మాత్రమే కాకుండా జాతీయ వృద్ధికి అవసరమైన చోదక శక్తిగా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. సహకార ఫెడరలిజమ్ శక్తిని వినియోగించి సమానత్వం, న్యాయం, శ్రేయస్సుతో పాటు అందరికీ సమాన అవకాశాలు అందించే భారతదేశాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ 10 వ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ మాట్లాడుతూ, దేశ సమగ్రాభివృద్ధి, తెలంగాణ పునర్నిర్మాణానికి అనుసరిస్తున్న విధివిధానాలు, భవిష్యత్తు లక్ష్యాలను సమగ్రంగా వివరించారు. తెలంగాణ రైజింగ్‌తో ప్రగతి పథంలో ముందుకు సాగుతున్న తెలంగాణ మాడల్‌ను సమావేశంలో ఆవిష్కరించారు. రాష్ట్రంలో చేపట్టిన అనేకానేక కార్యక్రమాలను సమగ్రంగా వివరించి అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు ఆర్థిక చేయూతను అందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన ఆర్థిక, పాలనాపరమైన ప్రాధాన్యతలపై చర్చించడానికి ఈ వేదిక నుంచి మాట్లాడటం గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నానంటూ.. ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ముందుగా పహల్గామ్ ఘటనను తీవ్రంగా ఖండించారు.

?? “పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ఘటనను తెలంగాణ ప్రజలు తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో దేశ సాయుధ దళాలు చేపట్టిన ప్రతి చర్యకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం. దేశంలో శాంతి, ఐక్యతను కాపాడుకోవాలన్న సంకల్పానికి తెలంగాణ కట్టుబడి ఉంది. మన వీరుల ధైర్యానికి, త్యాగాలకు వందనాలు. 1971 లో పాకిస్థాన్ తో జరిగిన యుద్ధంలో దేశానికి చిరస్మరణీయ విజయం అందించిన మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ నాయకత్వాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవడం సముచితం” అని అన్నారు.

“దేశ స్వాతంత్రం సాధించి వందేళ్లయ్యే 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో కూడిన వికసిత్ భారత్ లక్ష్యాలను నిర్దేశించుకోవడం స్ఫూర్తి దాయకం.

మిగితా 5వ పేజీలో



## అభివృద్ధికి సహకరించండి

- హెచ్ఎంఆర్ ఫేజ్-2కు ఆమోదం తెలపండి
- మెట్రో రైల్ ఫేజ్ 2 విస్తరణ, ట్రిపుల్ ఆర్, రింగ్ రైల్వే ప్రాజెక్ట్, సెమీకండక్టర్ల రంగానికి మద్దతివ్వండి
- పధాని మోడీకి సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- ప్రధానితో ప్రత్యేకంగా సమావేశం



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మర్యాదపూర్వకంగా కలిసి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ప్రధాన అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులను ప్రస్తావించిన ముఖ్యమంత్రి వాటి నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ప్రధానమంత్రిని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి గారు విన్నవించారు. గతంలో నిర్మించిన 69 కి.మీ ఫేజ్- 2 తరువాత నగర విస్తరణకు అనుగుణంగా 76 కి.మీ పొడవుతో ఐదు కారిడార్ల ఫేజ్- ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్రానికి పంపామని గుర్తుచేశారు. రూ. 24,269 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ జాయింట్ వెంచర్ (జెవీ) ప్రాజెక్టులో కేంద్ర వాటా 18 శాతం కాగా, రాష్ట్ర వాటా 30 శాతం. ఇటీవలి కాలంలో చెన్నై, బెంగళూరుకు ఆమోదించిన మెట్రో ప్రాజెక్టుల ఆధారంగా హైదరాబాద్ ప్రాజెక్టుకు కూడా అనుమతి ఇవ్వాలన్నారు.

మిగితా 2వ పేజీలో

## టీమ్ ఇండియా లా పని చేయాలి

- కేంద్ర-రాష్ట్ర సమన్వయంపై ప్రధాని మోడీ
- నీతి ఆయోగ్ సమావేశంలో

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ శనివారం నాడు నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాన్ని అధ్యక్షిస్తూ, జాతీయ లక్ష్యాలను సాధించేందుకు కేంద్రం మరియు రాష్ట్రాల మధ్య సహకారం అవసరమని అన్నారు. “కేంద్రం మరియు రాష్ట్రాలు ‘టీమ్ ఇండియా’ లా కలిసి పనిచేస్తే ఏ లక్ష్యమైనా అసాధ్యం కాదు,” అని ప్రధాని మోదీ అన్నారు. “వికసిత్ భారత్ ప్రతి భారతీయుడి లక్ష్యం. ప్రతి రాష్ట్రం వికసించాకే భారత్ వికసిస్తుంది. ఇది 140 కోట్ల ప్రజల ఆశయంగా ఉంది.” ఈ సంవత్సరానికి సమావేశం థీమ్: ‘వికసిత్ రాష్ట్రం ద్వారా వికసిత్ భారత్‌ఏ2047’, భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చే క్రమంలో రాష్ట్రాల పాత్రపై దృష్టి పెట్టడం జరిగింది” అని నీతి ఆయోగ్ ప్రకటనలో తెలిపింది.

నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన నేతలు:

ప్రధాని మోదీ రాష్ట్రాలను పర్యాటక అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. “ప్రతి రాష్ట్రం కనీసం ఒక పర్యాటక ప్రదేశాన్ని గ్లోబల్ ప్రమాణాలకు తగ్గట్లు అభివృద్ధి చేయాలి. ‘ఒక రాష్ట్రం: ఒక గ్లోబల్ డెస్టినేషన్’ అన్న విధంగా. దీనివల్ల సమీప నగరాల అభివృద్ధికీ ఇది దోహదపడుతుంది,” అని మోదీ అన్నారు.ఈ వ్యాఖ్యలు శనివారం నాడు భారత్ మండపంలో నిర్వహించిన 10వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో వచ్చినవి.భారతదేశంలో వేగవంతమైన పట్టణీకరణను ప్రశంసిస్తూ మోదీ అన్నారు:

“భారతదేశం వేగంగా పట్టణీకృతమవుతోంది. మనం భవిష్యత్‌కు సిద్ధంగా ఉండే నగరాల కోసం పని చేయాలి. అభివృద్ధి, ఆవిష్కరణ మరియు స్థిరత్వం మన నగరాల అభివృద్ధికి ఇంజన్‌లా పనిచేయాలి.” ఉత్తర తూర్పు పెట్టుబడిదారుల సమ్మిట్‌లో మావోయిజం, ఉగ్రవాదంపై మోదీ కీలక వ్యాఖ్యలు: “10,000 మందికిపైగా యువత...”వికసిత్ భారత్ కోసం మూడు సబ్-గ్రూపుల ప్రతిపాదన: ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు

నీతి ఆయోగ్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, కేంద్రం మరియు నీతి ఆయోగ్ భాగస్వామ్యంలో మూడు ప్రత్యేక సబ్-గ్రూపుల ఏర్పాటును ప్రతిపాదించారు: జిడిపి పెంపు: పెట్టుబడులను ప్రోత్సహించడం, తయారీ, ఎగుమతులు పెంచడం, ఉద్యోగాల సృష్టి - వీటిపై దృష్టి. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ ప్రాజెక్టులకు కేంద్ర వియబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా మద్దతు. జనాభా నిర్వహణ: జనాభా వృద్ధిని సక్రమంగా నిర్వహించడంతోపాటు, వృద్ధాప్యం, ఫెర్టిలిటీ రేట్లు తగ్గడం వంటి భవిష్యత్తు సమస్యలకు సన్నద్ధం కావడం. టెక్నాలజీ ఆధారిత పాలన: కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్, డ్రోన్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు వంటివాటిని ఉపయోగించి సమర్థవంతమైన, తక్షణ, ప్రజా కేంద్రిత పాలన అందించడం.

సమావేశానికి హాజరు కాని ముఖ్యమంత్రులు:

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో పాటు దక్షిణ రాష్ట్రాల నుంచి మరో ముగ్గురు ముఖ్యమంత్రులు, ఎన్‌డీఏ పాలనలో ఉన్న పుదుచ్చేరి సీఎం సహా, ఈ సమావేశానికి హాజరు కాలేదని పీటీఐ నివేదించింది. కర్ణాటక కాంగ్రెస్ సీఎం సిద్ధరామయ్య “మునుపటి కమిట్మెంట్స్” కారణంగా హాజరు కాలేకపోయారు. ఆయన ప్రసంగాన్ని సమావేశంలో చదివారు. కేరళ సీఎం పినరయి విజయన్ బదులుగా ఆర్థిక మంత్రి కె.ఎన్. బాలగోపాల్‌ను పంపారు. అలాగే పుదుచ్చేరి ఎన్‌డీఏ నేతృత్వంలోని ఏఐఎన్‌ఆర్‌సీ సీఎం ఎన్. రంగసామి కూడా హాజరు కాలేదు.

## అంతర్గత విషయాలు అంతర్గతంగానే మాట్లాడాలి



- పార్టీ అధినేతకు లేఖలు రాయడం తప్పేమీ కాదు
- అన్ని పార్టీల్లో కోవర్టులు ఉంటారు..
- రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చు
- రేవంత్ రెడ్డి మూటల ముఖ్యమంత్రి అని మరోసారి తేలిపోయింది
- నైతికత, నిజాయితీ ఉంటే సీఎం తక్షణం తన పదవికి రాజీనామా చేయాలి
- మీడియా సమావేశంలో కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో


సోదరి కవిత రాసిన లేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. కొన్ని అంతర్గత విషయాలను పార్టీలో అంతర్గతంగానే చర్చించాలని హితవు పలికారు. పార్టీలో తనతో సహా అందరూ కార్యకర్తలేనని, ఈ నియమం అందరికీ వర్తిస్తుందని స్పష్టం చేశారు. .హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ‘ఈ సందర్భంగా పార్టీలో దయ్యాలు ఉన్నారని కవిత చేసిన ఆరోపణలపై ఏమంటారని మీడియా ప్రతినిధులు అడగగా.. ప్రస్తుతం తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్, దయ్యం రేవంత్ రెడ్డి అని చెప్పారు. రాష్ట్రానికి పట్టిన ఆ శనిని, ఆ దయ్యాన్ని వదిలించడంపైనే తాము, తమ పార్టీ దృష్టి సారించిందని కేటీఆర్ చెప్పారు. బీఆర్ఎస్ పార్టీలో కోవర్టులు ఉన్నారన్న ఆరోపణలపై స్పందిస్తూ.. ప్రతీ పార్టీలోనూ కోవర్టులు ఉంటారని, సమయం వచ్చినప్పుడు వారు ఎవరనేది బయటపడుతుందని వివరించారు. బీఆర్ఎస్ ప్రజల పార్టీ అని, ప్రజాస్వామ్యబద్ధమైన పార్టీ అని కేటీఆర్ చెప్పారు. పార్టీలో ఏ కార్యకర్త అయినా తన అభిప్రాయాలను, సూచనలను అధ్యక్షుడికి తెలియజేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ అభిప్రాయ వెల్లడి అనేది మౌఖికంగా, లేఖల ద్వారా, ఫోన్ ద్వారా, నేరుగా కలిసి మాట్లాడడం ద్వారా.. ఇలా వివిధ పద్ధతులలో జరుగుతుంటుందని వివరించారు. అయితే, కొన్ని విషయాలను అంతర్గతంగా చర్చించాల్సి ఉంటుందని, వాటిని అంతర్గతంగానే చర్చించాలని కేటీఆర్ చెప్పారు. కాగా, ప్రెస్ మీట్ పూర్తయ్యేవరకూ కేటీఆర్ తన సోదరి కవిత పేరెత్తకపోవడం గమనార్హం.

### రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి

నైతికత, నిజాయితీ ఉంటే ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. నేషనల్ హెరాల్డ్ ఛార్జ్ షీట్ లో రేవంత్ రెడ్డి పేరు ఉండడం తెలంగాణకే అవమానకరమన్నారు. కర్నాటకలో డికే శివకుమార్ ను అక్కడి బీజేపీ నేతలు విమర్శిస్తుంటే తెలంగాణ బీజేపీ నేతలు రేవంత్ రెడ్డిని పల్లెత్తు మాట అనకపోవడం ఆ రెండు పార్టీల మధ్య ఉన్న అపురూప సంబంధానికి నిదర్శన మన్నారు. విచ్చలవిడిగా స్కాం లు చేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మోడీ ప్రభుత్వం ఎందుకు కాపాడుతుందో ప్రజలకు సమాధానం

మిగితా 2వ పేజీలో

## దేశంలో మరో రెండు కొత్త కోవిడ్ వేరియంట్లు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఇండియన్ సార్స్ కరోనా వైరస్-2 జీనోమిక్స్ కన్సార్టియం (ఇన్సాకాగ్) శనివారం కీలక ప్రకటన విడుదల చేసింది. ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7 అనే రెండు కొత్త కొవిడ్ సబ్ వేరియంట్లను భారత్‌లో గుర్తించామని వెల్లడించింది. ఎన్‌బీ.1.8.1 కొవిడ్ సబ్ వేరియంట్‌కు చెందిన ఒక కేసు ఏప్రిల్‌లో తమిళనాడులో బయటపడగా, ఎల్ఎఫ్.7 కొవిడ్ సబ్ వేరియంట్‌కు చెందిన నాలుగు కేసులు మేలో గుజరాత్‌లో నమోదైనట్లు ఇన్సాకాగ్ తెలిపింది. చైనా సహా ఆసియాలోని పలుదేశాల్లో కరోనా కేసులు పెరగడానికి ఈ సబ్ వేరియంట్లే కారణమవుతున్నాయని పేర్కొంది. ఈ సబ్ వేరియంట్ల వల్ల దేశంలో నమోదవుతున్న కరోనా కేసుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి విశ్లేషిస్తున్నామని వెల్లడించింది.మొత్తం మీద జేఎన్.1 కొవిడ్ వేరియంట్ వల్లే భారత్‌లో ఎక్కువగా కరోనా కేసులు నమోదవుతున్నాయని ఇన్సాకాగ్ స్పష్టం చేసింది. ఇప్పటివరకు వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కరోనా రోగుల నుంచి సేకరించిన శాంపిళ్లను ఇన్సాకాగ్ జన్యువిశ్లేషణ చేయగా వాటిలో 53 శాతానికిపైగా ఇన్ఫెక్షన్లకు జేఎన్.1 వేరియంటే కారణమని తేలింది. బీఏ.2 కొవిడ్ వేరియంట్ వల్ల 26 శాతం కరోనా కేసులు, ఇతరత్రా ఒమైక్రాన్ కొవిడ్ వేరియంట్ల వల్ల మిగతా 20 శాతం కరోనా కేసులు వ్యాపించినట్లు వెల్లడైంది.

ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7లను పర్యవేక్షణలో ఉన్న కొవిడ్ సబ్ వేరియంట్లుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకటించింది. నిపుణులు నిశితంగా వాటిని పర్యవేక్షించి నివేదిక ఇచ్చిన తర్వాతే అవి ప్రమాదకరమైనవా ? కావా ? అనే దానిపై క్లారిటీ వస్తుంది. డబ్ల్యూహెచ్ఓ ప్రాథమిక అంచనాల ప్రకారం ఎన్‌బీ.1.8.1 కొవిడ్ సబ్ వేరియంట్ వల్ల ప్రజలకు పెద్ద రిస్కేం ఉండదు. అయితే ఈ సబ్ వేరియంట్‌లో ఏ435ఎస్, వీ445హెచ్, టీ478ఐ అనే మ్యుటేషన్లు జరిగాయని డబ్ల్యూహెచ్ఓ గుర్తించింది. ఈ మ్యుటేషన్లు ప్రమాదకరమైనవి. వీటివల్ల ఇన్ఫెక్షన్లు వేగంగా వ్యాపిస్తాయి. మానవ రోగ నిరోధక వ్యవస్థ దాడిని తట్టుకొని ఇన్ఫెక్షన్‌ను వ్యాపింపజేసే సామర్థ్యం ఈ మ్యుటేషన్లకు ఉంటుంది.

## జూన్ 2 నుంచి స్లాట్ బుకింగ్

- అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇప్పటికే 47 చోట్ల
- నిషేధిత భూముల వివరాలకు ప్రత్యేక పోర్టల్
- త్వరలో గ్రామ పరిపాలనాధికారుల సేవలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని జూన్ 2వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఆస్తుల క్రయ విక్రయదారులకు పారదర్శకంగా అవినీతి రహితంగా సమయం ఆదా అయ్యేలా మెరుగైన సేవలు అందించేందుకు ప్రయోగాత్మకంగా మొదటి దశలో ఏప్రిల్ 10వ తేదీన 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఇక్కడ మంచి ఫలితాలు రావడంతో ఈనెల 12వ తేదీ నుంచి 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నామని తెలిపారు. రెండు విడతల్లో కలిపి 47 చోట్ల అమలు చేసిన విధానం విజయవంతమైందని, ప్రజల నుంచి అనూహ్యస్పందన లభించిందని 94 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని ఈ రెండు విడతల్లో కలిపి దాదాపు 36 వేల రిజిస్ట్రేషన్‌లు జరిగాయని తెలిపారు.ఇప్పటికే అమలులో ఉన్న 47 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో మాదిరిగానే మిగిలిన 97 చోట్ల స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా సులభతరమవుతుందని ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయింత్రం 5 గంటల వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని ఆస్తుల క్రయ విక్రయ దారులు స్లాట్ బుకింగ్ తర్వాత లాగిన్‌లో డిపార్ట్‌మెంట్ పోర్టల్ లో పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. స్లాట్ బుకింగ్ విధానంపై శనివారం నాడు మంత్రి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా

మిగితా 2వ పేజీలో

## కోవిడ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- దగ్గు, జలుబు ఉన్నప్పుడు మాస్కు ధరించాలి
- వర్షాకాలంలో సీజనల్ డిసీజ్‌ల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో పరిస్థితిని నిశితంగా గమనిస్తూ ఉండాలి
- కరోనా, సీజనల్ డిసీజ్‌ల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలి
- అన్ని హాస్పిటళ్లలో సరిపడా మెడిసిన్, ఇతర రీఏజెంట్స్ అందుబాటులో ఉంచుకోవాలి
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

వివరాలు 2వ పేజీలో



# కోవిడ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కరోనా వైరస్ వ్యాప్తి, సీజనల్ డిసీజ్‌ల నివారణ, నియంత్రణపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష చేశారు.ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి, డీఎంఈ నరేంద్రకుమార్, డీహెచ్ రవిందర్ నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు, ఎపిడమాలజిస్టులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఇండియా, ఇతర దేశాల్లో ఉన్న కోవిడ్ పరిస్థితులను అధికారులు, ఎపిడమాలజిస్టులు మంత్రికి వివరించారు. కొన్ని దేశాల్లో కోవిడ్ కేసులు స్వల్పంగా పెరిగినప్పటికి, హాస్పిటలైజేషన్ చాలా తక్కువగా ఉందన్నారు. ఇండియాలో పరిస్థితి నార్మల్‌గా ఉందని, జేఎన్.1 వేరియంట్ కేసులు కొన్ని నమోదయ్యాయని.. ఈ వేరియంట్ 2023 నుంచే ఇండియాలో వ్యాప్తిలో ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితులేమీ లేవన్నారు. ఇతర దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారికి తప్పితే, ఇతరులెవరికీ హాస్పిటలైజేషన్ అవసరం పడడం లేదన్నారు.

కేంద్ర ఆరోగ్యశాఖ నుంచి రాష్ట్రాలకు ఇప్పటివరకూ అడ్వైజరీలు, గైడ్‌లైన్స్ ఏమీ రాలేదు అని అధికారులు తెలిపారు. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉండడం, ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేకపోవడమే ఇందుకు కారణమై ఉండొచ్చునని అభిప్రాయ పడ్డారు. సుమారు 3 సంవత్సరాల క్రితమే కోవిడ్ ఎండెమిక్ స్టేజ్‌లోకి వచ్చిందని, అప్పుడప్పుడు కేసులు నమోదు అవడం, తగ్గడం, పెరగడం సహజమేనని ఎపిడమాలజిస్టులు మంత్రికి వివరించారు. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు దగ్గు, జలుబు, జ్వరాలు, శ్వాసకోశ వ్యాధుల బారిన పడే అవకాశం కూడా ఉంటుందన్నారు.రాష్ట్రంలో అక్కడక్కడ నమోదయ్యే కోవిడ్ కేసులను మేనేజ్ చేయడానికి అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామని అధికారులు మంత్రికి తెలిపారు. టెస్టింగ్ కిట్స్, మెడిసిన్ సహా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో పరిస్థితిని నిశితంగా గమనిస్తూ ఉండాలన్నారు. కరోనా, సీజనల్ డిసీజ్‌ల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.కోవిడ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు మంత్రి సూచించారు. వర్షాకాలంలో సీజనల్ డిసీజ్‌ల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జలుబు, దగ్గులాగే కోవిడ్ కూడా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందని.. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, దగ్గు, జలుబు ఉన్నప్పుడు మాస్కు ధరించడం వల్ల ఒకరి నుంచి ఒకరికి వైరస్‌లు వ్యాపించకుండా ఉంటాయన్నారు.

ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వ ఉంటే దోమలు పెరిగి, వ్యాధులు వ్యాపించే ప్రమాదముం టుందని, ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పేందుకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై పంచాయతీరాజ్, మునిసిపల్, ఇతర శాఖలతో కలిసి పని చేయాలన్నారు. అన్ని హాస్పిటళ్లలో సరిపడా మెడిసిన్, ఇతర రీఏజెంట్స్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కోవిడ్, డెంగీ పేరిట ప్రజలను ఆందోళనకు గురిచేసి, దోచుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# చిక్కిన పెద్దపులి



**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దుల్లోని చంద్రాపూర్ జిల్లాలో ఇటీవల ఇద్దరిని హతమార్చిన పెద్దపులిని ఎట్టకేలకు చిక్కింది. అడవుల్లో అమర్చిన సీసీ కెమెరాలు, ట్రాప్ సిబ్బంది సహకారంతో ఈ ఆడపులిని శుక్రవారం సాయంత్రం అటవీశాఖ అధికారులు అన్వేషించి కదలికలను గుర్తించారు. ఆ తర్వాత శనివారం ఉదయం మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో పెద్దపులి ని ఫారెస్ట్ అధికారులు బంధి ంచారు.

తార -224 అనే పేరున్న ఆడ పులి తడోబా అటవీ ప్రాంతంలో హడలెత్తిస్తూ తునికాకు కూలీలను, గిరిజన గ్రామాల ప్రజల్లో వణుకు పుట్టిస్తోంది. ఈ పెద్ద పులి వారం రోజుల్లో ఇద్దరిని పొట్టన పెట్టుకుంది. దాంతో పెద్ద పులి కోసం వారం రోజులుగా అన్వేషిస్తున్న సిబ్బంది చివరకు మత్తుమందు ప్రయోగంతో స్పృహ లేకుండా చేశారు. ఆ తర్వాత బంధించి చంద్రాపూర్ పులుల సంరక్షణ కేంద్రానికి తరలించారు . ఆటవీశాఖ అధికారి రాకేష్ హేపట్ తెలిపిన వివరాల ప్రకారం నాగభీడ్ తాలూకాలో తునికాకు సేకరణకు వెళ్లిన వారిలో ఒకరితోపాటు పశువుల కాపరిపై దాడి చేసి హతమార్చింది. తారా 224 అనే పులిగా గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాలు, ప్రత్యేక సిబ్బందితో ఆటవీశాఖ అధికారులు ఈ పులి కదలికలపై ఆరా తీసినట్టు తెలిపారు. తడోబా -బాలాపూర్ అటవీ ప్రాంతంలో దీని కదలికలను సీసీపుటేజీల ద్వారా గమనించిన అధికారులు షఉటర్ అజయ్ మరారే సాయంతో మత్తు ఇంజక్షన్ ను ప్రయోగించారు. స్పృహ కోల్పో యిందని పశు వైద్యాధికారి రవికాంత్ కోబ్రాగడే ద్వారా నిర్ధారించిన అనంతరం పెద్దపులిని చంద్రాపూర్ ప్రత్యేక కేంద్రానికి తరలించారు. ఇది ఎనిమిది సంవత్సరాల ఆడ పులి అని అధికారులు వివరించారు. సామాన్యులను బలిగొన్న పెద్దపులిని నిర్బంధించడంతో చంద్రపూర్ అటవీ ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

# జూన్ 2 నుంచి స్లాట్ బుకింగ్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మాట్లాడుతూ ప్రజల సమయాన్ని ఆదా చేసేందుకు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలకు స్వీకారం చుట్టామని తెలిపారు.ప్రజలకు వేగవంతమైన, సమర్థమైన సేవలందించడమే లక్ష్యంగా సంస్కరణలు తీసుకురావడమే కాకుండా వాటిని అమలు చేయవలసిన బాధ్యత అధికారు లదేనని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ శాఖలో చేపట్టిన సంస్కరణల ఫలితంగా ప్రజలకు మెరుగైన సేవలు అందడమేగాక పారదర్శకత పెరుగుతుందని అన్నారు.స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరణ చేస్తున్నామని పని భారం అధికంగా ఉన్న పఠాన్‌చెరువు, యాదగిరి గుట్ట, గండిపేట, ఇబ్రహీం పట్నం , సూర్యాపేట, జడ్చర్ల ,మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ మొత్తం తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు సిబ్బందిని నియమిస్తున్నామని తెలిపారు.

**ప్రత్యేక పోర్టల్.**

నిషేధిత జాబితాలోని ఆస్దులను ఎట్టి పరిస్థితుల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని భూ భారతి తరహాలో ప్రత్యేకంగా ఒక పోర్టల్ ను ఏర్పాటు చేశామని నిషేధిత ఆస్తుల వివరాలను అందులో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు.

ఎక్కడైనా నిషేధిత జాబితాలోని భూమిని రిజిస్ట్రేషన్ చేస్తే క్షణాల్లోహైదరాబాద్ లోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యాలయంలో ఆన్‌లైన్ లో తెలిసిపోయేలా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు**

ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించడానికి ఆదివారం రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో జెఎన్‌టియు ఆధ్వర్యంలో రాత పరీక్ష నిర్వహిస్తున్నామని ఈ పరీక్షకు సంబంధించి దాదాపు ఐదు వేల మందికి పైగా హాజరవుతారని ఎలాంటి ఇబ్బంది లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

గత ప్రభుత్వం విఆర్‌వో , విఆర్ఎ వ్యవస్థను రద్దుచేసి గ్రామీణ ప్రాంతాలలో సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేసిందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాలలో రెవెన్యూ వ్యవస్థను పటిష్టపరచడానికి గ్రామాలలో రెవెన్యూ సేవల పునరుద్దరణకు చర్యలు చేపట్టామని ఇందులో భాగంగానే గతంలో విఆర్‌వో , విఆర్ఎలుగా పనిచేసిన వారిలో ఆసక్తి గల వారు ఈ పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. వీలైనంత త్వరగా వీరి సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

# గోదావరి జలాలను ఎత్తుకుపోయేందుకు ఏపీ ప్రభుత్వం కుట్ర

- **మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ, గోదావరి జలాలను ఎత్తుకుపోయేందుకు ఏపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు ఏం చేస్తున్నట్లు? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిలదీశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రూ. 80 వేల కోట్లతో నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం 50శాతం నిధులు, మిగతా 50శాతం ఎఫ్‌ఆర్‌బీఎం పరిధి మించి రుణ సమీకరణకు ఏపీకి అనుమతించడం అన్యాయం, అనైతికం అని మండిపడ్డారు. ఎలాంటి అనుమతులు లేకుండా రూ. 80వేల కోట్లతో నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం 50శాతం నిధులు, మిగతా 50శాతం ఎఫ్ ఆర్ బి ఎం పరిధి మించి రుణ సమీకరణకు ఏపీకి అనుమతించడం అన్యాయం, అనైతికం. విభజన చట్టం ప్రకారం, కృష్ణా లేదా గోదావరి నదులపై కొత్త ప్రాజెక్టులు నిర్మించాలనుకుంటే రివర్ మేనజ్మెంట్ బోర్డుల అనుమతి అవసరం. కానీ అందుకు విరుద్దంగా, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని నిబంధనలను ఏపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుంటే అడ్డుకోవాల్సిన కేంద్రం, నిధులిచ్చి సహకరించడం దుర్మార్గం. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బిజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి ఏం లాభం? కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం తీసుకుంటే, ఎఫ్ ఆర్ బీ ఎం కింద రికవరీ పెట్టారు, కానీ బనకచర్ల విషయంలో మాత్రం అందుకు భిన్నంగా 50శాతం ఎఫ్ ఆర్ బి ఎం పరిమితి మించి రుణం తీసుకునేందుకు పర్మిషన్ ఇచ్చారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. విభజన చట్టం ప్రకారం, కృష్ణా లేదా గోదావరి నదులపై కొత్త ప్రాజెక్టులు నిర్మించాలనుకుంటే రివర్ మేనజ్మెంట్ బోర్డుల అనుమతి అవసరం. కానీ అందుకు విరుద్దంగా, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని నిబంధనలను ఏపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుంటే అడ్డుకోవాల్సిన కేంద్రం, నిధులిచ్చి సహకరించడం దుర్మార్గం. ఇది తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న తీవ్ర అన్యాయం. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బిజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి ఏం లాభం? అని హరీశ్‌రావు నిలదీశారు

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం తీసుకుంటే, ఎఫ్‌ఆర్‌బీఎం కింద రికవరీ పెట్టారు, కానీ బనకచర్ల విషయంలో మాత్రం అందుకు భిన్నంగా 50శాతం ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి మించి రుణం తీసుకునేందుకు పర్మిషన్ ఇచ్చారు. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ, ఆంధ్రప్రదేశ్‌పై వరాల జల్లులు కురిపిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు హరీశ్ రావు.

# అంతర్గత విషయాలు అంతర్గతంగానే మాట్లాడాలి

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాలన్నారు. ప్రజాస్వామిక స్ఫూర్తి ఉన్న తమ పార్టీలో అధ్యక్షుడికి ఎవరైనా సలహాలు సూచనలు ఇవొచ్చన్న కేటీఆర్, ఎవరైనా కోవర్డులు ఉంటే వాళ్లే బయటపడతారని చెప్పారు.ఏఏయంగ్ ఇండియా నేషనల్ హెరాల్డ్ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును చార్జిషీట్లో ఈడి చేర్చడం తెలంగాణ రాష్ట్రానికి అవమానకరం. గతంలో ఎన్నో తప్పులు చేసిన రేవంత్ రెడ్డికి ఇప్పటికీ బుద్ధి రాలేదు. 2015 ఓటుకు నోటు కేసు తర్వాత రేవంత్ రెడ్డిని బ్యాగ్ మాన్ అని పిలుస్తున్నారు. నేషనల్ హెరాల్డ్ కేసు సీటుకు రూట్ కుంభకోణం 50 కోట్లు పెట్టి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్ష పదవిని కొనుక్కున్నాడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియా ముందటనే చెప్పిండు. ఆనాడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన ఆరోపణలకు, ఇప్పుడు చార్జి షీట్ తో ఈ.డి ఆధారాలు చూపించింది. ఎవరు డబ్బులు ఇచ్చారు, ఏ పొజిషన్ ని అమ్ముకున్నారు, ఎన్ని డబ్బులు ఇచ్చారు అన్న వివరాలను ఈడి తన చార్జిషీట్లో స్పష్టంగా బయటపెట్టింది. తెలంగాణ అనేది కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలో మారింది. ఢిల్లీ కాంగ్రెస్కు ఎప్పుడు డబ్బులు కావాలంటే అప్పుడు భారీ మొత్తంలో అందిస్తూ రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకుంటున్నాడు. ఓటుకు నోటు జరిగినప్పుడు రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే, కానీ ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి. యావద్దేశం ముందు తెలంగాణ పరువు తీసారు. 2020లో కర్ణాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప హౌసింగ్ స్కామ్ లో ఉన్నట్టు వార్తలు వస్తే నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే రాజీనామా చేయాలని కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పట్లో డిమాండ్ చేశారు.

నిజాయితీ, నైతికత ఉంటే రేవంత్ రెడ్డి స్వచ్ఛందంగా ముఖ్యమంత్రి పదవి నుండి తప్పుకోవాలి. లేదంటే కాంగ్రెస్ అగ్ర నాయకత్వం స్పందించి ఆయనను ఆ పదవి నుంచి తప్పించాలి. రేవంత్ రెడ్డి మూటల ముఖ్యమంత్రి కాదు మూటల ముఖ్యమంత్రి అని తేలిపోయింది. మూటలు ఇచ్చే పిసిసి పదవి పొందారనీ వెంకట్ రెడ్డి చెప్పిండు.మూటలు పంపుతూ ముఖ్యమంత్రి పదవిని కాపాడుకుంటున్నారనీ దేశమంతా తెలుసు.ఆఫీస్ బేరర్ల నుంచి మూటలు తీసుకొని ఆనాడు కాంగ్రెస్ పత్రికకు నిధులు అందించారని ఈడీ చెప్పింది.17 నెలల్లోనే 44 సార్లు ఢిల్లీకి పోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరుదైన రికార్డు సృష్టించారు. చీకట్లో అమిత్ షా కాళ్లు పట్టుకోవ డం, కేసుల నుంచి తప్పించాలని వేడుకోవడం.. బయటికి వచ్చి పెద్ద పెద్ద ఫోజులు కొట్టడం ఇదే రేవంత్ రెడ్డి 44 సార్లు ఢిల్లీకి పోయి చేసేది. ఒక్క ఇటుక పేర్చకుండానే, ఒక కొత్త ప్రాజెక్టులు కట్టకుండానే, ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయకుండానే, ఒక్క హామీని అమలు చేయకుండానే లక్ష 80 వేల కోట్ల అప్పు చేసిండు. ఈ డబ్బులు అన్ని ఎక్కడికి పోతున్నాయో నా తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలి" అన్నారు.

# అభివృద్ధికి సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ మహానగరం చుట్టూ రీజినల్ రింగ్ రోడ్డు ను సమగ్రంగా అభివృద్ధి చేయాలని, ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగాన్ని కూడా ఒకేసారి ప్రారంభించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఇప్పటికే భూ సేకరణలో పురోగతి ఉన్న ఉత్తర భాగం పూర్తయ్యేలోపు దక్షిణ భాగాన్ని చేపట్టకపోతే వ్యయం పెరిగే ప్రమాదం ఉందని వివరించారు. భూసేకరణ వ్యయంలో 50 శాతం భారాన్ని భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా 370 కి.మీ పరిధిలో రీజినల్ రింగ్ రైల్వే లైన్ నిర్మించాల్సిన అవసరం ఉందని, దీనికి కూడా కేంద్రం సహకరించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని డ్రైపోర్టు నుంచి ఆంధ్రప్రదేశ్ లోని మచిలీపట్నం (బందరు) పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కోరారు. ఔషధ ఎగుమతులు, తయారీ రంగ అభివృద్ధికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా మద్దతు ఇస్తోందని ప్రధానమంత్రి గారికి ముఖ్యమంత్రి గారు తెలిపారు. సెమీకండక్టర్ పరిశ్రమలో తెలంగాణ కీలకపాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ప్రముఖ ఆర్ అండ్ డీ కేంద్రాలు, మౌలిక వసతులు, నైపుణ్యం గల మానవ వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రతిపాదించిన %క్ష్మీూవీ% ప్రాజెక్టుకు ఆమోదం తెలిస్తే, పెట్టుబడులు, ఉద్యోగాలు పెరుగుతాయన్నారు. హైదరాబాద్ మొదటి నుంచి రక్షణ రంగంలో కీలకంగా ఉంటోన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ రంగంలో %మీవీజు%లకు ప్రోత్సాహం అవసరమన్నారు. హైదరాబాద్ %-% బెంగళూరు డిఫెన్స్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలంగాణకు సమానంగా మద్దతు ఇవ్వాలని ప్రధానమంత్రి గారితో ముఖ్యమంత్రి గారు అన్నారు.




## రాజన్న సేవలో కరీంనగర్ ఏసీపీ..

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడలోని శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామివారిని కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు ఏసీపీ వెంకటస్వామిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా, వెంకటస్వామి గతంలో వేములవాడ టౌన్ సీఐగా పనిచేశారు.



## ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీలో ప్రోటోకాల్ ఉల్లంఘన..

**-ఇది ఎమ్మెల్యేకు అవమానం**

**-బీఆర్ఎస్ నాయకులు ఆరోపణ**

**-కలెక్టర్‌పై చర్యలకు డిమాండ్..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పట్టాల పంపిణీ కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావును ఈ కార్యక్రమానికి ఆహ్వానించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇది ప్రోటోకాల్ నిబంధనలకు విరుద్ధమని, ఎమ్మెల్యేకు అవమానకరమని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. పలు మండలాలలో జరిగిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాలకు సిరిసిల్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావును ఆహ్వానించకపోవడం గమనార్హం. అంతేకాకుండా, కేటీఆర్‌పై ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన కె.కె. మహేందర్ రెడ్డికి ప్రభుత్వపరమైన ఎలాంటి అధికారాలు లేనప్పటికీ, ఆయనని ముఖ్య అతిథిగా అధికారికంగా పాల్గొనడం చట్టవిరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు. ఇలాంటి కార్యక్రమాలు సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మధ్య వివాదాలకు దారితీస్తున్నాయని, గొడవలకు దారితీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదాలకు ముఖ్యకారకుడు సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె.కె. మహేందర్ రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. గతంలోనూ ఇలాంటి విషయాలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ప్రోటోకాల్ ప్రకారమే నిర్వహించాలని, అశాంతికి గురిచేస్తూ మరియు భారత రాజ్యాంగానికి విరుద్ధంగా వివాదాస్పదంగా కార్యక్రమాలను నిర్వహించిన రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు



## స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**


కథలాపూర్ మండలం ఊటుపల్లి గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన స్వామివారి కళ్యాణ మహోత్సవం, ధ్వజ స్తంభం, మంటపం నిర్మాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రభుత్వ విప్‌కు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆయన వేడుకున్నారు. పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# పేదవారి ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇల్లు

**-ఇచ్చిన హామీ మేరకు మంజూరు పట్టాలు ఇస్తున్నాము**

**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



పేదవారి ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇల్లు అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్అన్నారు. శనివారం కోనరావుపేటలో రెండో విడత క్రింద 561 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు విప్ అది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తాము ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం, భూమి పత్రాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశామని, నియోజకవర్గం లో మొత్తం 3500 ఇందిరమ్మ ఇండ్లకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. నిర్ణీత సమయం, ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం ఇల్లు నిర్మించుకొని సహాయం పొందాలని అన్నారు. కోనరావుపేట మండలంలోని బ్రిడ్జిలు త్వరితగతిన పూర్తి చేయిస్తామని, మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని అన్నారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ కోనరావుపేట మండలంలో 561 మంది లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేశామని, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని, 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం చేసుకోవాలని అన్నారు. 4 దశలో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని, బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు.

### ఎవరైనా డబ్బులు అడిగితే ఫోన్ చేయండి

ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవి వంటి చేయాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే స్వయంగా ఫోన్ చేయాలని అన్నారు. ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని , నిర్మాణానికి అవసరమైన ఇసుక మండల కేంద్రాలలో అందుబాటులో పెడతామని అన్నారు.

ఇంటి నిర్మాణానికి ఒక్కో దశలో అవసరమైన ఇసుక కోసం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందని వెల్లడించారు. రవాణా ఛార్జీలు చెల్లించాలనిఅన్నారు.. 30 రోజుల లోగా నిర్మాణ పనులను లబ్ధిదారులు ప్రారంభించని పక్షంలో మంజూరు చేసిన ఇండ్లు రద్దు అయ్యే అవకాశం ఉంటుందని, నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ ప్రభాకర్, పిడి హౌసింగ్ శంకర్, సంబంధిత అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్‌ను ఆపెయ్యాలి..

**-మావోయిస్టులపై బీజేపీ క్రూరవైఖరి మానుకోవాలి..**

**-సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు టి స్కైలాబ్ బాబు**




**బలగం టీవీ, సిరిసిల్ల**

ఛత్తీస్‌గఢ్‌లో 27 మంది మావోయిస్టులు, ఆ పార్టీ జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు సహా జరిగిన ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా సీపీఎం ఖండిస్తోందని, బీజేపీ తన క్రూర వైఖరి మానుకొని మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .శనివారం సిరిసిల్ల బి వై నగర్ అమృత్ లాల్ శుక్లా భవన్ లో సీపీఎం జిల్లా స్థాయి సమావేశం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు జవ్వాజి విమల అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్యఅతిథిగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు హాజరై మాట్లాడుతూ మావోయిస్టుల నుండి చర్చల కోసం వచ్చిన అనేక విన్నపాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వం మరియు బీజేపీ నేతృత్వంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కారాన్ని కనుగొనే మార్గాన్ని వదిలేసి, హింసతో కూడిన విధానాన్ని అనుసరిస్తోందని ఇది ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ హత్యలేనని ఆయన అన్నారు.

కేంద్ర హోంమంత్రి మరియు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు, చర్చలు అవసరం లేదని పేర్కొనడమూ, ప్రజల ప్రాణాలను తీసే పనిని జరుపుతూ కొత్త తరహా ఫాసిస్టు లక్షణాలను ప్రతిబింబిస్తున్నాయని, ఇవి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. మావోయిస్టుల రాజకీయంవిధానం పట్ల సీపీఎం వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, చర్చల కోసం వచ్చిన వారి విజ్ఞప్తిని ప్రభుత్వం అంగీకరించి, తక్షణమే పారామిలిటరీ దళాల కార్యకలాపాలను నిలిపివేయాలని సీపీఎం పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. అనేక రాజకీయ పార్టీలు, పౌర సమాజ సభ్యులు కూడా చర్చలకై విజ్ఞప్తి చేస్తున్నారని ఇప్పటికైనా నరమేధం ఆపి శాంతి చర్చలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూశం రమేష్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లలో రాజీవ్ యువ వికాస లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా ఉండాలన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ మల్లారపు అరుణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ముక్తికాంత అశోక్, అన్నల్ దాస్ గణేష్, సూరం పద్మ గురజాల శ్రీధర్, మల్లారపు ప్రశాంత్, శ్రీరాముల రమేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పాలనాధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శనివారం సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుంచి గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణ పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, మే 25న ఆదివారం నాడు ఉదయం 10 30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లాలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటల వరకు జవాబు పత్రాలను, 9.20 గంటల వరకు ప్రశ్నా పత్రాలను తరలించాలని అన్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సరిగ్గా సీల్ చేసి జేఎన్టియూహెచ్ కు అందించాలని, ఉపయోగించని జవాబు పత్రాలను కూడా తప్పనిసరిగా పరీక్ష కేంద్రాల నుంచి సేకరించాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీటింగ్ అరేంజ్మెంట్స్ పక్కాగా ఉండాలని, అభ్యర్థులకు అవసరమైన త్రాగు నీరు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పించాలని అన్నారు .

# భారత టెస్ట్ జట్టు కెప్టెన్‌గా గిల్

- **ఇంగ్లాండ్ టూర్ కు భారత టెస్ట్ జట్టు ప్రకటన**
- **జూన్ 20 నుంచి టెస్ట్ సిరీస్**




**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లాండ్ టూర్ కోసం భారత టెస్ట్ జట్టును బీసీసీఐ ప్రకటించింది. మొత్తం 18 మంది ఆటగాళ్లతో జట్టును ప్రకటించింది. ఈ ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ ను కెప్టెన్‌గా ఎంచుకుంది. రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్ గా నియమించింది. జూన్ 20 నుంచి ఆగస్టు 4 వరకు ఈ సిరీస్ జరగనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత భారత్ ఆడబోయే మొదటి ద్వైపాక్షిక సిరీస్ ఇదే.

ముంబైలోని భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో జట్టు ఎంపిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిసిసిఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా, అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. సమావేశం తర్వాత జరిగిన విలేకరుల సమావేశంలో అజిత్ అగార్కర్ భారత జట్టును ప్రకటించారు. భారత జట్టు యువ జట్టుతో నాల్గవ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ను ప్రారంభించ నుంది. ఇంగ్లాండ్‌జట్టుతో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడాల్సి ఉంది. చాలా కాలం తర్వాత తిరిగి వచ్చిన కరుణ్ నాయర్ కూడా జట్టులోకి ఎంపికయ్యాడు. ఫిట్‌నెస్ కారణాల వల్ల మహ్మద్ షమీకి జట్టులో స్థానం లభించలేదు. ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్ కూడా టెస్ట్ జట్టులోకి తిరిగి వచ్చాడు. ఇక సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, అర్షదీప్ సింగ్ ముగ్గురు యంగ్ ప్లేయర్లకు లక్కీ ఛాన్స్ దక్కింది. వీళ్లు తొలిసారి టెస్టు జట్టుకు ఎంపిక య్యారు.కాగా, సాయి సుదర్శన్, అర్షదీప్ ఇప్పటికే టీ20, వన్డేల్లో ఆడినప్పటికీ టెస్టుల్లో అవకాశం ఇదే ఫస్ట్ టైమ్. మరోవైపు, అభిమన్యు టీమ్‌ఇండియాకు ఎంపికవ్వడం ఇదే తొలిసారి. రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. అతను వికెట్ కీపింగ్‌తో పాటు మిడిల్ ఆర్డర్‌లో ముఖ్యమైన పాత్ర పోషిస్తాడు. ధ్రువ్ జురెల్ రెండవ వికెట్ కీపర్‌గా ఎంపికయ్యాడు. మరోవైపు, సీనియర్ బ్యాటర్లు అజింక్యా రహానే, ఛతేశ్వర్ పుజారాకు మరోసారి నిరాశే మిగిలింది.

**ఇంగ్లండ్ టూర్‌కు 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్/వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), అభిమన్యు ఈశ్వరన్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కరుణ్ నాయర్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్.

**భారత్ ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ పూర్తి షెడ్యూల్**

1వ టెస్ట్: జూన్ 20–24, 2025 %–% హెడింగ్లీ, లీడ్స్

2వ టెస్ట్: జూలై 2–6, 2025 – ఎడ్జ్‌బాస్టన్, బర్మింగ్‌హామ్

3వ టెస్ట్: జూలై 10–14, 2025 –లార్డ్స్, లండన్

4వ టెస్ట్: జూలై 23–27, 2025 –ఓల్డ్ ట్రాఫోర్డ్, మాంచెస్టర్

5వ టెస్ట్: జూలై 31–ఆగస్టు 4, 2025 – ది ఓవల్, లండన్



## మలేషియా మాస్టర్స్ ఫైనల్‌కు శ్రీకాంత్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇండియన్ స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ మలేషియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నీ ఫైనల్లోకి ప్రవేశించాడు. బీడబ్ల్యూఎఫ్ ఈవెంట్‌లో ఆరేళ్ల తర్వాత శ్రీకాంత్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సెమీస్ మ్యాచ్‌లో అతను వరుస గేమ్‌ల్లో విజయం సాధించాడు. జపాన్‌కు చెందిన యుషి తనకపై 21–18 , 24–22 స్కోరుతో నెగ్గాడు. 2019 తర్వాత శ్రీకాంత్.. తొలిసారి బీడబ్ల్యూఎఫ్ ఫైనల్లోకి ఎంట్రీఇచ్చాడు.

## కోహ్లీ, రోహిత్ స్థానాలను భర్తీ చేయడం కష్టం

**చీఫ్ సెలెక్టర్ అగార్కర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లండ్ టూర్ 18 మంది సభ్యుల బృందాన్ని ప్రకటించిన సమయంలో భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. కోహ్లీ, రోహిత్ రిటైరయ్యారని, వాళ్ల స్థానాన్ని భర్తీ చేయడం కష్టమని పేర్కొన్నారు. అయితే ఇంగ్లండ్ టూరులో ఇతర ఆటగాళ్లు వారి పాత్రలను పోషిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. కోహ్లీ, రోహిత్ ఇద్దరూ క్రికెట్‌లో పెద్ద ప్లేయర్లు అని, అలాంటి ఆటగాళ్లు రిటైర్ అయితే, వాళ్ల స్థానాన్ని నింపడం కష్టమైన పని అని, కానీ ఇతరులు దాన్ని అవకాశంగా మలుచుకుంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఆ ఇద్దరు సూపర్‌స్టార్ల స్థానంలో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ సాయి సుదర్శన్, మరో బ్యాటర్ కరుణ్ నాయర్‌ను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.గత నెలలోనే కోహ్లీ టెస్టు రిటైర్మెంట్ గురించి తనతో సంప్రదించినట్లు వెల్లడించారు. చాంపియన్స్ ట్రోఫీ తర్వాత అతను తన టెస్టు క్రికెట్ గురించి అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆటగాళ్లు ఎవరైనా రిటైర్మెంట్ నిర్ణయం తీసుకుంటే, అది తనకు సంబంధం లేనిదని, రిటైర్మెంట్ అనేది వ్యక్తిగతమైన నిర్ణయమని, కొత్త డబ్ల్యూటీసీ సైకిల్ ప్రారంభమైందని, మళ్లీ జట్టును నిర్మించే పనిలో పడినట్లు తెలిపారు.

## థియేటర్ల బంద్ లేదు.. సమస్యల పరిష్కారానికి కొత్త కమిటీ

**బలగం టీవీ, హైదరాబాద్**

లుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ కానున్నాయన్న ప్రచారానికి తెలుగు ఫిల్మ్ ఛాంబర్ తెర దించింది. థియేటర్ల బంద్ ఏమీ ఉండదని, యథావిధిగానే షోలు కొనసాగుతాయని తాజాగా స్పష్టం చేసింది. థియేటర్లకు కూడా పర్సెంటేజీ విధానం అమలు చేయాలని డిమాండ్ నేపథ్యంలో ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో నిర్మాతలు శనివారం ఉదయం ఫిల్మ్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అగ్ర నిర్మాతలు దిల్ రాజు, నాగవంశీ, మైత్రి రవి, సుధాకర్ రెడ్డి, సురేశ్ బాబు, బెల్లంకొండ సురేష్, ఏఎం రత్నం, రాధా మోహన్, స్రవంతి రవికిషోర్, బాపినీడు తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశం సందర్భంగా పలు అంశాలను చర్చించారు. అందులో భాగంగానే భవిష్యత్‌లో థియేటర్ వ్యాపారం మరింత మెరుగ్గా ఉండేందుకు మూడు సెక్టార్ల నుంచి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ తెలిపారు. ఈ కమిటీ మే 30వ తేదీ నుండి వరుస సమావేశాలను నిర్వహించనున్నట్టు తెలిసింది. వీలైనంత త్వరగా అన్ని సమస్యలను పరిష్కరించడమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశ్యం.

## ‘థాంక్యూ డియర్’ ఫస్ట్ లుక్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




యువ కథానాయకుడు ధనుష్ రఘుముద్రి నటించిన ‘థాంక్ యూ డియర్’చిత్రం ఫస్ట్ లుక్ లాంచ్ ఘనంగా జరిగింది. ప్రముఖ సీనియర్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చేతుల మీదుగా ఈ ఫస్ట్ లుక్ విడుదలైంది. ఫస్ట్ లుక్‌ను చూసిన తమ్మారెడ్డి, చిత్ర బృందాన్ని ప్రశంసిస్తూ, ఈ సినిమా ధనుష్‌కు మంచి గుర్తింపు తెస్తుందని, యువ బృందానికి ఆశీస్సులు అందజేస్తూ, సినిమా ఘన విజయం సాధించాలని కోరారు. ఈ సందర్భంగా హీరో ధనుష్ మాట్లాడుతూ “థాంక్ యూ డియర్’ నా రెండో చిత్రం. ఈ సినిమా నా కెరీర్‌లో కీలకమైంది”అని అ న్నారు. నిర్మాత పప్పు బాలాజీ రెడ్డి మాట్లాడుతూ “ఈ చిత్రం ధనుష్‌కు గొప్ప పేరు తెస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ని ర్మాత పుణీత్ రెడ్డి పాల్గొన్నారు.




## పంజాబ్‌కు షాకిచ్చిన ఢిల్లీ

- **6 వికెట్ల తేడాతో విజయం**
- **గెలుపుతో సీజన్‌ను ముగించిన ఢిల్లీ క్యాపిటల్స్**

**బలగం టీవీ, జైపూర్**

ఐపీఎల్? 2025 సీజన్‌ను దిల్లీ క్యాపిటల్స్ జట్టు విజయంతో ముగించింది. పాయింట్స్ టేబుల్‌లో టాప్ ప్లేస్‌పై కన్నేసిన పంజాబ్ కింగ్స్ టీమ్‌కు షాకిచ్చింది. ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 8 వికెట్లకు 206 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ 4 వికెట్లు కోల్పోయి 3 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 206 పరుగుల భారీస్కోరు చేసింది. పంజాబ్ కింగ్స్ తరపున మార్కస్ స్టొయినీస్ 16 బంతుల్లో అజేయంగా 44 పరుగులు, శ్రేయస్ అయ్యర్ 34 బంతుల్లో 53 పరుగులు సాధించారు. తన అద్భుతమైన ఇన్నింగ్స్ లో స్టొయినీస్ 4 సిక్సర్లు, 3 ఫోర్లు కొట్టి పంజాబ్‌ను 200 పరుగుల మార్కును దాటేలా చేశాడు. పంజాబ్ తరపున నేహాల్ వధేరా(16), శశాంక్ సింగ్(11) పరుగులు చేశారు. ఢిల్లీ బౌలర్లలో ముస్తాఫిజుర్ 3, కుల్దీప్ యాదవ్ 2, విప్రజ్ నిగమ్ 2, ముకేశ్ కుమార్ ఒక వికెట్ పడగొట్టారు.



అనంతరం ఢిల్లీ ఓపెనర్లు కేఎల్ రాహుల్(35), ఫాఫ్ డుప్లెసిస్(23) శుభారంభం అందించగా.. సెధిఖుల్లా అటల్(22) పర్వాలేదనిపించాడు. తర్వాత ఢిల్లీ యువ బ్యాటర్ సమీర్ రిజ్వీ ఐపీఎల్‌లో తన తొలి అర్ధ సెంచరీ సాధించాడు. రిజ్వీ 22 బంతుల్లో50 పరుగులు పూర్తి చేసుకున్నాడు.సమీర్ రిజ్వీ 25 బంతుల్లో 58 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. తన ఇన్నింగ్స్‌లో రిజ్వీ 3 ఫోర్లు , 5 సిక్సర్లు కొట్టాడు. కరుణ్ నాయర్ 27 బంతుల్లో 44 పరుగులు చేశాడు. కరుణ్ నాయర్ 5 ఫోర్లు, 2 సిక్సర్లు కొట్టాడు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ 2 వికెట్లు పడగొట్టగా.. మార్కో యాన్సెన్, ప్రవీణ్ దూబె తలో వికెట్ తీశారు. ఈ నేపథ్యంలోచి ఢిల్లీ జట్టు ఐపీఎల్ 2025లో తన చివరి మ్యాచ్‌ను 6 వికెట్ల తేడాతో గెలిచింది.

## ప్రభుత్వం వచ్చి ఏడాదైనా సినిమా పెద్దలు సీఎంను కలవలేదు : పవన్


**బలగం టీవీ, హైదరాబాద్**



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా సినిమా పెద్దలు సీఎంను కలువలేదన్నారు. తమ ప్రభుత్వం ఇండస్ట్రీ అభివృద్ధినే తప్పా, వ్యక్తుల అభివృద్ధిని చూడదని స్పష్టం చేశారు. తాజా ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ‘తెలుగు చిత్రసీమ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్‌కు కృతజ్ఞతలు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా సినిమా పెద్దలు సీఎంను కలువలేదు. సినీపెద్దలు, అగ్రనటులను వైసీపీ ప్రభుత్వం ఎలా చూసిందో మరిచిపోయారా? అగ్రనటులు, సాంకేతిక నిపుణులకు ఎదురైన ఇబ్బందులు మరిచిపోయారా? చలనచిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, ‘మా’ మరిచినట్లున్నాయి. ఇకపై వ్యక్తిగత చర్చలు ఉండవు, సినిమాసంఘాల ప్రతినిధులే రావాలి. మా ప్రభుత్వం వ్యక్తులను కాదు. సినీరంగం అభివృద్ధినే చూస్తుంది. అందరూ కలసి రావాలన్న సూచనకు సానుకూలంగా స్పందించలేదు. రూ.కోట్ల వ్యయంతో నిర్మించే చిత్రాలను ప్రోత్సా హిస్తామని ముందే చెప్పాం. సృజనాత్మక వ్యాపారంలో ఉన్నవారి గౌరవానికి భంగం వాటిల్ల కూడదని చెప్పాం. వైసీపీ ప్రభుత్వం వ్యక్తులను చూసి పనిచేసేది, కక్ష సాధింపులకు దిగేది’ అని అన్నారు.

## బాలీవుడ్ నటుడు ముకుల్ దేవ్ కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**



హిందీ సినీ పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ నటుడు ముకుల్ దేవ్ (54) కన్నుమూశారు. ‘సన్ ఆఫ్ సర్దార్’, ‘ఆర్.. రాజ్‌కుమార్’, ‘జై హో’ వంటి సినిమాలతో ఆయన ప్రేక్షకులకు సుపరిచితులు. శుక్రవారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. అయితే, ముకుల్ దేవ్ మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆయన సన్నిహితురాలు, నటి దీపశిఖా నాగ్‌పాల్ ఈ మరణవార్తను సోషల్ మీడియా ద్వారా ధృవీకరించారు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ముకుల్ దేవ్‌తో ఉన్న పాత చిత్రాన్ని పంచుకుంటూ “RIP” అని పేర్కొన్నారు. ముకుల్ దేవ్, ప్రముఖ నటుడు రాహుల్ దేవ్‌కు సోదరుడు. ఆయన చివరిగా ‘అంత్ ది ఎండ్’ అనే హిందీ సినిమాలో కనిపించారు.

# కేంద్ర రాష్ట్రాల మధ్య సహకారం అవసరం

(మొదటి పేజీ తరువాయి)

ఆ లక్ష్యాలను చేరుకోగల సామర్థ్యం మనకుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రయాణంలో ముందువరుసలో నడవడానికి కీలక పాత్ర పోషించడానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. దేశం రాష్ట్రాల సమాఖ్య. అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల సమగ్ర, స్థిరమైన అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాకారమవుతుంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి ముడిపడి ఉంటుంది. ఈ సమయంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మద్దతుగా నిలవడంతో పాటు ఆయా రాష్ట్రాల సామర్థ్యాలను ఉపయోగించుకోవడం అత్యవసరం. అదే సమ యంలో వెనుకబడిన రాష్ట్రాలకు అవసరమైన ప్రతి సహాయాన్ని కేంద్రం అందించాలి. రాష్ట్రాల మధ్య సమతుల్యత చాలా కీలకం.

వికసిత్ భారత్‌కు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం తరపున, ప్రజల తరపున తెలంగాణ రైజింగ్ 2047 అనే నినాదంతో మా కార్యాచరణ పథకాన్ని సమర్పిస్తున్నాను. మా ఆకాంక్షలు, దృఢ సంకల్పానికి ఈ రోడ్ మ్యాప్ ప్రతిబింబిస్తుంది. మేం సంకల్పించిన సాహసోపేతమైన మార్పును సాధించాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం, భాగస్వామ్యం అత్యంత అవసరం. ఈ విషయంలో సహకార సమాఖ్య స్ఫూర్తితో కలిసి పని చేయాలని మేం ఆకాంక్షిస్తున్నాం. వన్ ట్రిలియన్ డాలర్ల జీఎస్‌డీపీ సాధించే రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మొదటి స్థానంలో ఉండాలని కోరుకుం టున్నాను. జాతీయ స్థాయి అంచనాల ప్రకారం ఈ లక్ష్యం 15 ఏళ్లలో సాధ్యమవుతుందని భావిస్తున్నాం. కానీ, ఈ ప్రయాణాన్ని వేగవంతం చేసి పదేళ్లలోపే లక్ష్యాన్ని సాధించాలన్న సంకల్పంతో తెలంగాణ ఉంది. 2047 నాటికి జాతీయ జీడీపీకి తెలంగాణ 8 శాతం, అంటే 2.4 ట్రిలి యన్ల స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేసి తెలంగాణ జాతీయ లక్ష్యాలకు చోదకం గా నిలబడుతుంది. దేశంలో ఇప్పటికే పారిశ్రా మిక, సాంకేతిక, పరిపాలనా సంస్కరణల్లో తెలంగాణ అగ్రగామిగా ఉండటం గర్వంగా ఉంది. ప్రస్తుతం దేశ జనాభాలో తెలంగాణ వాటా కేవలం 2.9 శాతంగా మాత్రమే ఉంది. ఆర్థిక సహకారం అందించడంలో తెలంగాణ వాటాను గణనీయంగా పెంచాలని కోరుకుంటున్నాం. భారత యూనియన్‌లో అత్యంత డైనమిక్, సంపన్న రాష్ట్రాల్లో ఒకటిగా ఎదగాలని మేం లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. స్థిరమైన, సమ్మిళితమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో పరస్పరం సహకరించుకోవాలి. దేశంలోని 6 మహా నగరాలైన ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్‌ల పట్టణ జీడీపీలో ప్రధాన వాటాను కలిగి ఉన్నాయి. ముంబయి, ఢిల్లీ లాంటి నగరాలతో పోల్చితే పరిమాణంలో చిన్నదైనప్పటికీ హైదరాబాద్ ఇప్పటికే జీడీపీలో సుమారు 2.5 శాతం సమకూర్చుతోంది. ఆర్థిక, ప్రతిభ, పెట్టుబడి, సాంకేతిక పురోగతి కేంద్రాలుగా ఉన్న ఈ మహా నగరాల పూర్తి సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడంలో గౌరవ ప్రధానమంత్రి, సంబంధిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల నాయకత్వంలో జాతీయ స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఈ టాస్క్‌ఫోర్స్ ఆయా నగరాల్లో ప్రత్యేక సమగ్ర పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపా యాలకు పెట్టుబడులు, పాలన సంస్కరణలపై ప్రత్యేకమైన వ్యూహం ఉండాలి. జాతీయ ఆర్థిక వ్యవస్థకు ఊపును తీసుకురావడంతో పాటు లక్షలాది ఉద్యోగాలను సృష్టించడంలో, ప్రపంచ పట్టణ ఆర్థిక వ్యవస్థలో భారతదేశ స్థానాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. తెలంగాణ రైజింగ్ 2047 లో మహిళా సాధికారత కీలకం. మహిళల సంఘాలకు పెట్టుబడులు సమకూర్చడం వలన వారి కుటుంబాలు, సంఘాలు, ఆర్థిక వ్యవస్థలో మంచి ఫలితాలు వస్తాయని తెలంగాణ ప్రభుత్వం దృఢంగా విశ్వసిస్తోంది. మహిళా స్వావలంబన, పెట్టుబడులు, చలనశీలత, ఆర్థికాభివృద్ధిని దన్నుగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి మిషన్'ను ప్రారంభించింది.

యువత సాధికారితపై రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం యువతను సమర్థమైన, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగే పౌరులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకుని అందుకు అనుగుణంగా అనేక కార్యక్రమాలు చేపట్టింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, పోలీస్ పాఠశాల, ఏటీసీలు, పరిశ్రమలతో అనుసంధానమైన నైపుణ్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు మద్దతుగా తెలంగాణ ప్రభుత్వం 'రాజీవ్ గాంధీ సివిల్ సర్వీసెస్ అభయహస్తం' పథకాన్ని ప్రారంభించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతకు స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించేందుకు 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రారంభించాం. దేశంతో పాటు రాష్ట్రంలో కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఒక్క ఏడాదిలోనే 60 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం కీలక మైలురాయిని చేరుకుంది.

వాతావరణ మార్పులతో గత పదేళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విధాన ఎజెండాలో ముందు వరుసలో ఉంచింది. రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, సన్న ధాన్యానికి కింటాకు రూ. 500 ప్రోత్సాహకం, 5 లక్షల మేరకు బీమా అందిస్తున్నాం. గిరిజన రైతుల వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు 'ఇందిరా సౌర గిరిజల వికాసం' పథకాన్ని ప్రారంభించాం. సుదీర్ఘకాలంగా ఉన్న అసమానతనలు తొలగించాలన్న లక్ష్యంతో మా ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేపట్టిందని, ఇది తెలంగాణ సాధించిన మరో ఘనతను మీతో పంచుకోవడం నాకు గర్వంగా ఉంది. ఈ సర్వే తెలంగాణకు ఎక్స్-రే వంటిది. ఈ చారిత్రాత్మక చర్యకు గుర్తింపుగా, 2024, ఫిబ్రవరి 4న 'సామాజిక న్యాయ దినం'గా ప్రకటించాం. ఇందుకు సంబంధించి రెండు బిల్లులను గౌరవనీయ భారత రాష్ట్రపతి ఆమోదానికి కేంద్ర ప్రభుత్వానికి పంపాం. ఇది తెలంగాణలో సామాజిక న్యాయం, సమగ్రగత సాధనలో కీలక ఘట్టం. కచ్చితమైన, భారీ డేటా సేకరణ, సమ్మిళిత విధాన రూపకల్పన, సామాజిక న్యాయానికి పునాదిగా ఎలా ఉపయోగపడుతుందో చూపడం ద్వారా తెలంగాణ దేశానికి నమూనాగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహించాలనే నిర్ణయానికి మా శాసనసభ తీర్మానం ప్రేరణనివ్వడం మాకు గర్వకారణం" అని అన్నారు.

ఎస్సీ ఉప వర్గీకరణను సమర్థిస్తూ గౌరవ సుప్రీంకోర్టు 2024, ఆగస్టు 1న చారిత్రాత్మక తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో ఎస్సీ ఉప వర్గీకరణపై పరిశీలన చేసి సిఫార్సులు చేయాలని జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన ప్రత్యేక విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరాం. సమగ్ర విశ్లేషణ అనంతరం కమిషన్ ఎస్సీల్లోని 59 కులాలను మూడు వర్గాలుగా విభజించాలని సిఫార్సు చేసింది.మారుతున్న కాలానుగుణంగా ఆర్థిక ప్రగతి పథం వైపు నడిపించడానికి తెలంగాణ పారిశ్రామిక రంగం పురోగతికి ప్రగతిశీల విధానాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, కేంద్రీకృత నైపుణాభివృద్ధి వంటి అంశాలతో వ్యూహాత్మక పారిశ్రామికీకరణ ఎజెండాను తెలంగాణ అనుసరిస్తోంది. తెలంగాణ రాష్ట్రం తమదైన ఆర్థిక వ్యవస్థలతో పూర్తి పట్టణ (కోర్ అర్బన్)-పాక్షిక పట్టణ (సెమీ అర్బన్), గ్రామీణ ప్రాంతాలుగా విభజించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాం.

హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీని లేదా భారత్ ఫ్యూచర్ సిటీని భారతదేశపు మొట్టమొదటి నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. భిన్న రంగాలు, స్థిరమైన పట్టణ-పారిశ్రామిక కేంద్రంగా 30 వేల ఎకరాలలో విస్తరించి ఉన్న ఈ నగరం నిర్మితమవుతోంది. 15 లక్షల మందికి నివాసం, 7.5 లక్షల మందికి ఉపాధిని కల్పించేలా రూపొందుతోంది.

భారత్ ఫ్యూచర్ సిటీలో ఏఐ సిటీ, హెల్త్ సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ ఎలక్ట్రానిక్స్ జోన్, ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ జోన్, రెసిడెన్షియల్ మరియు ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్, స్పోర్ట్స్ సిటీ, యూనివర్సిటీ, ఎడ్యుకేషనల్ హబ్ మరియు డేటా హబ్ వంటి ప్రత్యేక జోన్లు ఉంటాయి. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో, ముఖ్యంగా ఐటీ, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక రంగాల్లో సేవల రంగం కీలక పాత్ర పోషిస్తోంది. ఈ విషయంలో రాష్ట్రం జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలిచింది. మహిళా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ.. మరియు సమ్మిళిత సాంకేతికత సాధికారత లక్ష్యంగా తెలంగాణ పనిచేస్తోంది. అలాగే పర్యావరణ హిత మౌలిక వసతులు కల్పిస్తోంది. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ- 2025 తీసుకొచ్చాం. విద్యుత్ వాహనాల వినియోగం పెంచాలన్న లక్ష్యంతో వాటిపై వంద శాతం రోడ్డు పన్ను మినహాయించాం. 2030 నాటికి రాష్ట్రంలో 6 వేల పబ్లిక్ %జువ% ఛార్జింగ్ స్టేషన్లు, 2035 నాటికి 12 వేల స్టేషన్లు ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించాం. రాష్ట్ర భవిష్యత్తును మార్చగల దార్శనిక పట్టణ ప్రాజెక్టులను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోంది. హైదరాబాద్ మెట్రో రైలు నెట్‌వర్క్ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్, ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వేలు, ప్రాంతీయ రింగ్ రోడ్ ఇందులో ఉన్నాయి. అనుసంధానతను (కనెక్టివిటీ) మెరుగుపర్చడం, రాకపోకలను (ప్రయాణాలు) ప్రోత్సహించడం, ఆర్థిక వృద్ధికి కొత్త జోన్‌లను తెరవడమే ఈ పనుల లక్ష్యం.


తెలంగాణ అభివృద్ధిని వేగవంతం చేయడమే కాకుండా జాతీయ ఆర్థిక, మౌలిక సదుపాయాల వృద్ధికి గణనీయంగా దోహదపడే ఈ ప్రాజెక్టులకు భారత ప్రభుత్వం నిర్మాణాత్మక మద్దతు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. దక్షిణ తెలంగాణలోని కరువు పీడిత మరియు ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు ఎస్. జైపాల్ రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జీవనాడి. ఈ పథకం 1,226 గ్రామాల తాగునీటి అవసరాలను, 12.36 లక్షల ఎకరాలకు సాగు నీటి వసతిని కల్పిస్తుంది. ఈ ఎత్తిపోతల పథకానికి అవసరమైన అనుమతులు %జఔజ% ఇవ్వాలని, పథకానికి ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన కింద ఆర్థిక సహాయం అందించాలి. స్థిరమైన, సమ్మిళిత పారిశ్రామిక అభివృద్ధికి తెలంగాణ ఒక నమూనాగా అవతరించింది. గత రెండు సంవత్సరాల్లో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాల్లో ప్రపంచవ్యాప్తంగా వివిధ కంపెనీల ద్వారా 52 వేల పైచిలుకు ఉద్యోగాలను కల్పించే రూ.2.18 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది" అని ముఖ్యమంత్రి వివరించారు. దాదాపు వందకు పైగా అంశాలతో తెలంగాణ రైజింగ్ ఎజెండాను సమగ్రంగా నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి గారు ఆవిష్కరించారు. కేంద్ర రాష్ట్రాల మధ్య పరస్పరం సహకారం, సమన్వయం ఉండాలని అభిలషించారు. దేశం నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి తెలంగాణ సంపూర్ణంగా సహకరిస్తుందని స్పష్టం చేశారు.

## వేశ్యగా చూస్తున్నారు.. అందుకే అందాల పోటీల నుంచి తప్పుకున్న

- మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగి సంచలన ఆరోపణ
- ఆమె ఆరోపణలు అవాస్తవం
- తల్లి ఆరోగ్యం బాగాలేదని పోటీల నుంచి తప్పుకుంది
- మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే వివరణ

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆతిథ్యమిస్తున్న మిస్ వరల్డ్ 2025 అందాల పోటీలను వివాదాలు చుట్టుముడుతున్నాయి. పోటీలకు వచ్చిన ప్రపంచ సుందీమణులను రేవంత్ సర్కార్ రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సందర్శనకు తీసుకెళ్తున్న విషయం తెలిసిందే. అలా ఇటీవలే రామప్ప ఆలయం సందర్శన సమయంలో అందాల పోటీకి వచ్చిన సుందరీమణుల పాదాలను స్థానిక మహిళలతో కడిగించడం విమర్శకు దారి తీసిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా మరో వార్త వెలుగులోకి వచ్చింది. ఈ అందాల పోటీల నిర్వాహకులపై అసంతృప్తితో మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగి .. ఈ పోటీల నుంచి తప్పుకున్నట్లు తెలిసింది. ఆమె హైదరాబాద్‌ను వీడి ఇంగ్లం డ్‌కు వెళ్లిపోయినట్లు సమాచారం. వ్యక్తిగత కారణాలతోనే పోటీల నుంచి



తప్పుకున్నట్లు నిర్వాహకులకు చెప్పినట్లు తెలుస్తోంది.

అయితే, పోటీల నుంచి తప్పుకున్న తర్వాత 'ది సన్' న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ పోటీ నిర్వాహకులపై తీవ్ర ఆరోపణలు చేసినట్లు తెలిసింది. పోటీ నిర్వాహకులు తనను ఓ వేశ్యగా చూస్తున్నాం ంటూ సంచలన ఆరోపణలు చేసింది. అంతేకాదు తనతో కొందరు అగౌరవంగా ప్రవర్తించారని చెప్పుకొచ్చింది. వినోదం కోసం మమ్మల్ని వీధుల్లో తిప్పారని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు చాలా అసౌకర్యంగా అనిపించిందని చెప్పుకొచ్చింది. అందుకే మనస్తాపంతో పోటీల నుంచి తప్పుకున్నట్లు తన గోడును వెల్లబోసుకుంది. 'సమాజంలో మార్పు తీసుకురావడానికి, యువతలో స్ఫూర్తి నింపేందుకు నేను అక్కడికి వెళ్లాను. అయితే, అక్కడ పరిస్థితులు వేరు. కొందరిని సంతృప్తి పరిచేందుకు కోతుల్లా ప్రదర్శన ఇచ్చేందుకు మేం అక్కడున్నాం. అలాంటి పరిస్థితుల్లో ఉండాల్సి వస్తుందని నేను కలలో కూడా ఊహించుకోలేదు. చాలా అగౌరవంగా అనిపించింది. మనల్ని అక్కడ ఎంత తక్కువగా చూస్తున్నారో అర్థమైంది' అని ది సన్‌తో మిల్లా తన ఆవేదనను చెప్పుకుంది. ప్రస్తుతం ఆమె కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

మిస్ వరల్డ్ పోటీల నుంచి తప్పుకుని స్వదేశం వెళ్లిన మిస్ ఇంగ్లాండ్ 2025 మిల్లా మాగీ చేసిన ఆరోపణలను నిర్వాహకులు కొట్టి పారేశారు. ఈ మేరకు శనివారం మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే ఒక ప్రకటన విడుదల చేశారు. "మే మొదటి వారంలో మిస్ ఇంగ్లాండ్ మిల్లా తన తల్లి ఆరోగ్యం బాగా లేనందున పోటీల నుంచి విరమించుకు ంటున్నట్టు సంస్థకు తెలిపారు. ఆమె పరిస్థితిని అర్థం చేసుకొని ఇంగ్లాండ్‌కు తిరిగి పంపే ఏర్పాట్లు చేశాం. పోటీల నుంచి వైదొలిగిన తర్వాత, మిస్ ఇంగ్లాండ్ రన్నరప్ మిస్ షార్లెట్ గ్రాంట్ ఇంగ్లాండ్ తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ముందుకొచ్చారు. ఆమె పోటీలో పాల్గొనేందుకు అను మతిచ్చాం" అని మోర్లే తెలిపారు. బ్రిటిష్ మీడియా సంస్థలు మిల్లా మాగీ పోటీలో అనుభవాలపై తప్పుడు, కథనాలను ప్రచు రిస్తున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. మిస్ వరల్డ్ సంస్థ నిజా యితీ, గౌరవం, "బ్యూటీ విత్ ఎ పర్పస్" అనే విలువలకు అద్దం పట్టేలా పోటీలు కొనసాగు తున్నాయని తెలిపారు. మీడియా సంస్థలు జర్నలిస్టిక్ విలువలు పాటిస్తూ, వాస్తవాలను ధృవీకరించుకోవాలని కోరారు.

## సిస్టర్ స్ట్రోక్‌తో కేటీఆర్ చిన్న మెదడు చితికింది

- మంత్రి సీతక్క

బలగం టీవి, హైదరాబాద్

సిస్టర్ స్ట్రోక్‌తో కేటీఆర్ చిన్న మెదడు చితికి, అందుకే ఇష్టాను సారంగా మాట్లాడుతున్నారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు తీసుకున్నప్పుడు లేని భయం, కమీషన్ ముందుకు రావడానికి మాత్రం ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టులో బాంబులు పెట్టిందని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, దాన్ని కపిపుచ్చుకోవడానికి పిచ్చిపిచ్చిగా కెటిఆర్ మాట్లాడుతున్నారని అన్నారు. మరి అధికారంలో ఉన్నప్పుడు ఈ విషయాన్ని ఎందుకు నిరూపించాలేదో కేటీఆర్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని తెలిపారు. సచివాలయంలో శనివారం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ అబద్దాల పునాదుల మీద వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం కేటీఆర్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోబెల్స్‌ను మించిన గ్లోబల్ ప్రచారానికి కేటీఆర్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష హొదాకు కేటీఆర్ పనికిరారన్న మంత్రి సీతక్క ప్రజల కోసం ఆయన ఎప్పుడూ పని చేయరని, కానీ అబద్దాలను ప్రచారం చేయటంలో మాత్రం ముందుంటారని ఆరోపించారు. కెసిఆర్ చుట్టూ దయ్యాలు ఉన్నాయని కవిత చెప్పిందని, కవిత చెప్పిన దెయ్యం నువ్వేనా కేటీఆర్ అంటూ నిలదీశారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదని అన్నారు. త్యాగాల మీద రాజభోగాలనుభవించిన చరిత్ర కెసిఆర్ కుటుంబానిదని విమర్శించారు. కెసిఆర్ కుటుంబానికి దోచుకునీ, దాచుకునే చరిత్ర ఉందని విమర్శించారు. భారతదేశ ఔన్నత్యం కోసం భారతదేశ ప్రజల కోసం మాట్లాడుతున్న రాహుల్ గాంధీ మీద కక్షకట్టి ఈడిని ప్రయోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న మోడీ ప్రశంసల కోసం కేటీఆర్ పాకులాడుతున్నారని తెలిపారు.